బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 06 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 3


## పినపాక ఏజెన్సీలో భారీ ఎన్‌కౌంటర్.. ఆరుగురు మావోయిస్టులు మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రశాంతంగా ఉన్న పినపాక ఏజెన్సీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గిరిజల గ్రామాల్లో తుపాకుల మోత తో గ్రామస్థులు భయభ్రాంతులకు గురయ్యారు. గురువారం ఉదయం కరకగూడెం మండల పరిధిలోని రఘునాథపాలెం గ్రామ శివారులు మావోయిస్టులకు, పోలీసులకు జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందిన వారిని లచ్చన్న దళ సభ్యులుగా పోలీసులు నిర్ధారించారు.

గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు విలేకరులతో మాట్లాడుతూ గత కొంతకాలంగా మణుగూరు ఏరియాలో నిషేధిత మావోయిస్టుకు చెందిన లచ్చన్న దళం సంచరిస్తుందన్న సమాచారంతో గురువారం ఉదయం కరకగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మోతె అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు నిషేధిత సీపీఐ మావోయిస్టు ధళ సభ్యులు ఎదురుపడి పోలీసులపై కాల్పులు జరిపారని అన్నారు. ఆనంతరం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా ఎదురుకాల్పుల్లో భ ద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటికి చెందిన ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు. అదేవిధంగా ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలు జరిగినట్లు తెలిపారు. మిగితా 2వ పేజీలో

# హైదరాబాద్‌లో ఏఐ సిటీ..






- 200 ఎకరాల్లో ఏర్పాటు
- సీఎం రేవంత్‌రెడ్డి
- హెచ్ఐసీసీలో ఏఐ ఇంటర్‌నేషనల్ సదస్సు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ శివారు ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల ప్రాంగణంలో అధునాతన ఏఐ సిటీని తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నగరం ఐటీ సెక్టార్‌లో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని అన్నారు. ఏఐ అనేది నేటి తరం అద్భుత ఆవిష్కరణ అని కొనియాడారు. నగరంలోని హెచ్ఐసీ సీలో ఏఐ ఇంటర్‌నేషనల్ సదస్సును రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరికీ ఏఐ అనే థీమ్‌తో రెండు రోజుల పాటు ఈ సదస్సు జరుగుతోంది. ఈ కార్యక్రమానికి ప్రపంచ వ్యాప్తంగా 2 వేల మంది పైగా ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి 25 ఏఐ మార్గదర్శకాలతో రోడ్ మ్యాప్‌ను విడుదల చేశారు.

అనంతరం సీఎం మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం మొత్తం ఆర్టిఫిషియల్ టెక్నాలజీ వైపు చూస్తోందని అన్నారు. కొత్త టెక్నాలజీ ఆశ, భయం అనే రెండింటిని తీసుకొస్తుందని సీఎం వ్యాఖ్యనించారు. కానీ సాంకేతిక పరిజ్ఞానం లేకపోతే ప్రపంచం ఎప్పటికీ మారకుండా అలాగే ఉండిపోతుందని అన్నారు. ఎవరో ఒకరి అద్భుత ఆవిష్కరణలతోనే ప్రపంచంతో పాటు ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయన్నారు. ఇటీవల కొత్త ఆవిష్కర ణలతో ఉద్యోగాలు పోతాయనే భయం పట్టుకుందని.. అయితే ఆ టెన్షన్ అవసరం లేదని.. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది లభిస్తుందన్నారు. రైల్ ఇంజిన్, టీవీ, కెమెరాతో ప్రారంభమైన ఆవిష్కరణలు ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ దాకా వచ్చాయన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ విస్తరణకు హైదరాబాద్ నగరమే కేంద్ర బిందువుగా ఉంటుందని, దేశంలో మరే ఇతర నగరం అందుకు సన్నద్ధం కాలేదని ముఖ్యమంత్రి చెప్పారు. నాస్కామ్ సహకారంతో తెలంగాణ ఏఐ మిషన్, టీ-ఏఐఎం వంటి ప్రణాళికలకు తోడు కొత్తగా నిర్మించబోయే ఏఐ హబ్ (ఏఐ సీటీ) ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ ఒక తిరుగులేని నగరంగా వెలుగొందటం ఖాయమని అన్నారు.

సాంకేతికత, ఆవిష్కరణ లేకుండా సమాజంలో మార్పులు అసాధ్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పారిశ్రామిక రంగంలో కొత్త విప్లవాలు పుట్టుకొచ్చిన ప్రతిసారి వాటి భవిష్యత్తును అంచనా వేయడంలో తడబాట్లు జరిగాయని, ప్రస్తుత ఏఐ విప్లవం విషయంలోనూ అదే జరుగుతోందని, మార్పుకు సిద్ధంగా ఉంటేనే ముందుకు వెళ్లగలమని చెప్పారు. ప్రస్తుతం ఏఐ విప్లవం కొనసాగుతోందని, ఆ రంగంలో అపారంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు హైదరాబాద్ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. ఏఐ రంగంలో రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామన్నారు. అందుకు ఏఐ నిపుణులతో కలిసి ప్రభుత్వం ముందుకు వెళుతోందని చెప్పారు. హైదరాబాద్ ను ఏఐ హబ్ గా తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగానే గ్లోబల్ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తోన్న ఏఐ హబ్ లో ప్రపంచ దిగ్గజ టెక్ కంపెనీలన్నీ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, టెక్ రంగానికి చెందిన ప్రముఖులు, ఏఐ నిపుణులు పాల్గొన్నారు.

కార్యక్రమం అనంతరం సీఎం రేవంత్ రెడ్డిని ప్రపంచ దిగ్గజ టెక్ సంస్థ ఐబీఎం వైస్ ప్రెసిడెంట్ (ఎమర్జింగ్ టెక్ అడ్వకేసీ) డానియెలా కాంబ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్తు, నూతన ఆవిష్కరణల అన్వేషణ తదితర అంశాలపై ఇరువురూ చర్చించారు. హైదరాబాద్ శివారు ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల ప్రాంగణంలో అధునాతన ఏఐ సిటీని తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తోన్న విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు.

ఫ్యూచర్ సిటీని ఏఐ రాజధానిగా తీర్చిదిద్దాలనే తెలంగాణ ప్రభుత్వ ప్రణాళికల పట్ల ఐబీఎం వైస్ ప్రెసిడెంట్ ఆసక్తి కనబరిచారు. ఈ సమావేశంలో ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మదన్ మోహన్, ఇతర ఉన్నతాధికారులు, ఐబీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రవీంద్రభారతిలో 41 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తామని రాష్ట్ర డిప్యూటీ సీఎం, మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. గురువారం రవీంద్ర భారతిలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27, 862 విద్యాలయాలకు ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ఉచితంగా విద్యుత్తును అందిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం విద్యతో పాటు గురువులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 11,062 పోస్టులకు నోటిఫికేషన్ వేయడంతో పాటు పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు.విద్య ప్రమాణాలు పెంచేందుకు..విద్యా వ్యవస్థను మరింత అభివృద్ధి చేసేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లుగా తెలంగాణ డిప్యూటీ సీఎం తెలిపారు.

గత దశాబ్ద కాలంగా ఈ రాష్ట్రంలో డీఎస్సీ నీ నిర్వహించలేదన్న భట్టి విక్రమార్క తాము అధికారంలోకి రాగానే 11062 పోస్టులకు నోటిఫికేషన్ వేయడంతో పాటు పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో మరో 6వేల పైబడి పోస్టులకు నోటిఫికేషన్ వేయడానికి భవిష్యత్తు ప్రణాళికను తయారుచేసి ముందుకు పోతున్నామని తెలిపారు.10ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉపాధ్యాయులు ప్రమోషన్స్, బదిలీలకు నోచుకోలేద న్నారు.తాము వచ్చిన తర్వాత 45 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు చేశామని అదే విధంగా 30 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామన్నారు.

ప్రపంచంతో పోటీపడే విధంగా విద్యా విధానం మారాలని పాఠశాలలో వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు వేసి వాటి నిర్వహణ స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించి ప్రభుత్వం 667 కోట్ల రూపాయలను వెచ్చించిందని తెలిపారు. పాఠశాలలో స్వీపర్లు లేకపోవడం వల్ల గురువులే పాఠశాలను క్లీన్ చేసుకోవాల్సిన దుస్థితి గత పాలనలో నెలకొంది. ఆ పరిస్థితి పోవాలని ఈ ఆర్థిక సంవత్సరం శానిటేషన్ వర్క్స్ ఏర్పాటుకు 136 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగిందన్నారు.

ఇప్పటివరకు పరిశ్రమలకు పనికొచ్చే సిలబస్ అందుబాటులో లేకపోవడం వల్ల పరిశ్రమలు అభివృద్ధి కూడా వెనకడుగు పడింది రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని చెప్పడానికి సంతోషిస్తున్నామన్నారు.రాష్ట్రంలో 63 ఐటిఐ కళాశాలలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ గా ఏర్పాటు చేసి అదునాతన సాంకేతిక విద్యా బోధన అందిస్తున్నామని తెలిపారు డిప్యూటీ సీఎం.ఉపాధ్యాయులు, గురువులతో మాట్లాడి చర్చించిన తర్వాతే విధానపరమైన నిర్ణయాలు తయారు చేస్తామన్న భట్టి విక్రమార్క

## చెరువు కట్టలు, కాల్వల మరమ్మతులకు వారం రోజుల్లో టెండర్లు పిలవాలి



- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని వట్టెం పంప్ హౌస్‌ను యుద్ధప్రాతిపదికన పూర్వ స్థితికి తీసుకురావాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భారీవర్షాలకు తెగిపోయిన చెరువు కట్టలు, కాల్వల పునరుద్ధరణ, మరమ్మతుల కోసం వారం రోజుల్లో టెండర్లు పిలవాలని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులపై దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించిన ఆయన, శుక్రవారం ఉదయానికే ఆన్‌లైన్‌లో టెండర్లు అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. వర్షాలతో ఉత్పన్నమైన పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలు, వర్ష సూచన నేపథ్యంలో ముందు జాగ్రత్తలపై మంత్రి దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు, ఈఎన్సీలు, చీఫ్ ఇంజినీర్లు సమీక్షలో హాజరయ్యారు.

ఎగువన ఉన్న గొలుసు కట్టు చెరువు తెగడంతో ఒక్కసారిగా ఆడిట్ ద్వారా వరదనీరు పంప్ హౌస్‌లోకి చేరినట్లు ఇంజినీర్లు మంత్రికి వివరించారు. పంప్ హౌస్ నిర్మాణ సమయంలో ఆ తరహా జాగ్రత్తలు తీసుకోలేదా ముందస్తుగా అంచనా వేయలేదా అని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇంజినీర్లను అడిగారు. అకస్మాత్తుగా వచ్చిన వరద పంప్ హౌస్‌ను ముంచెత్తిందని వివరించారు. పంప్ హౌస్‌లోని నీటిని తోడే పని ప్రారంభమైందని, నెల రోజుల్లో మళ్లీ యథాతథ స్థితికి వస్తుందని తెలిపారు. ఈ మేరకు అన్ని అంశాలపై నివేదిక ఇవ్వాలని మంత్రి ఇంజినీర్లను ఆదేశించారు.

యుద్ధప్రాతిపదికన పూర్వ స్థితికి తీసుకురావాలన్న మంత్రి, పనులు వేగవంతం చేయాలని సంబంధిత ఏజెన్సీకి స్పష్టం చేయాలని తెలిపారు. భవిష్యత్‌లో ఈ తరహా ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, రిటైనింగ్ వాల్ నిర్మించాలని ఆదేశించారు. ప్రాజెక్టులు, కాల్వల నిర్వహణ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించే ప్రసక్తే లేదన్న ఆయన, సంబంధిత చీఫ్ ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు పడుతుందని హెచ్చరించారు. ఎక్కడైనా ప్రమాద సంకేతాలు గుర్తిస్తే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని, ప్రాజెక్టులతో పాటు జలాశయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు.అన్ని షట్టర్లు, రెగ్యులేటర్లను క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి చెప్పారు. వర్షాలకు చెరువులు, కాల్వలు అన్నీ కలిపి మొత్తం 559 నిర్మాణాలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.60 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.350 కోట్ల వరకు అవసరమవుతాయని ఇంజినీర్లు పేర్కొన్నారు. తాత్కాలిక మరమ్మతుల కోసం వెంటనే షార్ట్ టెండర్లు పిలవాలన్న మంత్రి, నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. సామర్థ్యం మేరకు జలాశయాల్లో నీరు నింపాలని ఇంజినీర్లకు మంత్రి తెలిపారు.

## మద్యం మత్తులో.. తల్లిపై కొడుకు లైంగికదాడి

**బలగం టీవీ, జైపూర్**

ఒక వ్యక్తి మద్యం మత్తులో కన్న తల్లిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధిత మహిళ తన చిన్న కుమారుడు, కుమార్తెతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడైన ఆమె పెద్ద కుమారుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌లోని బుండి జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

ఆగస్ట్ 6న 52 ఏళ్ల మహిళ 28 ఏళ్ల పెద్ద కొడుకుతో కలిసి సోదరుడి ఇంటికి వెళ్లింది. వారి గ్రామానికి తిరిగి వస్తుండగా మద్యం మత్తులో ఉన్న కుమారుడు నిర్మానుష్య ప్రాంతంలో తల్లిపై లైంగికదాడి చేశాడు.కాగా, ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత బాధిత మహిళ తన చిన్న కొడుకు, కుమార్తెతో కలిసి దాబీ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నది. పెద్ద కుమారుడు తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఆ మహిళ పెద్ద కొడుకును అరెస్ట్ చేశారు. అతడ్ని ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించినట్టు పోలీస్ అధికారి తెలిపారు. దీంతో కోర్టులో హాజరుపరిచి రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించినట్లు వెల్లడించారు.



## జీహెచ్ఎంసీ ద్వారా 3.10 లక్షల మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఈ ఏడాది జీహెచ్ఎంసీ ద్వారా 3.10 లక్షల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హితం కోసం మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దామని వారు పిలుపునిచ్చారు. ఎల్‌బీ నగర్ జోన్, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆమె ఉద్యోగులు, సిబ్బందికి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.




ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించడం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని.. పర్యావరణం పట్ల ప్రజలను చైతన్య పరచడంలో భాగంగా జీహెచ్ఎంసీ ద్వారా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది జీహెచ్ఎంసీ ద్వారా 3.10 లక్షల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో 8 ఇంచుల సైజులో 2.70 లక్షలు, ఒక ఫీట్ సైజులో 30 వేలు, ఒకటిన్నర ఫీట్ సైజులో 10 వేల విగ్రహాలను పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పంకజ, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ పాల్గొన్నారు. జిహెచ్ఎంసి అధికారులు, ఉద్యోగులు పాల్గొని మట్టి వినాయక ప్రతిమలను స్వీకరించారు.

## జైనూర్ నిందితుడిని కఠినంగా శిక్షిస్తాం

- మంత్రి సీతక్క



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ బాధితురాలి ఉదంతంలో నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. ని జైనూర్ మండలంలో ఆటో డ్రైవర్ దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఆదివాసీ మహిళను గాంధీ ఆసుపత్రిలో ఆమె గురువారం పరామర్శించారు. బాధితురాలికి ప్లాస్టిక్ సర్జరి జరుగుతున్న విషయాన్ని తెలుసుకుని.. ఆమెకు అందుతున్న చికిత్స వివరాలను డాక్టర్ల నుంచి అడిగి తెలుసుకున్నారు. బుధవారం సైతం సీతక్క బాధితురాలిని పరమర్శించారు. గురువారం నాడు మరోసారి గాంధీ ఆసుపత్రికి చేరుకుని బాధితురాలి కుటుంబానికి భరోసా కల్పించారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు గిరిజన సంక్షేమ శాఖ తరుపున తక్షణ పరిహారంగా లక్ష రూపాయల చెక్కును అందచేశారు. ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఘటన విషయంలో కొందరు చేస్తున్న విమర్శలపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసులను ఆదుకోవడానికి హైదరాబాద్‌లో బంధువులు ఎవరు వుండరని, అందుకే తక్షణ పరిహారంగా లక్ష రూపాయలు ఇస్తే.. దాన్ని కూడా తప్పు పడతారా అని అన్నారు. వారి హయాంలో ఆదిలాబాద్‌లో టేకు లక్ష్మి హత్యాచారానికి గురైతే కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. కోర్టు జోక్యం చేసుకుంటే తప్ప బాధిత కుటుంబానికి న్యాయం దక్కలేదన్నారు. దాడి ఘటనను పక్కదారి పట్టించాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదన్నారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగిందని తెలిసిన వెంటనే ప్రభుత్వం స్పందించిందని... 24 గంటల్లోనే నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సీతక్క స్పష్టం చేశారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ కేస్ నమోదు చేసినట్లు పేర్కొన్న మంత్రి.. నిందితుడికి కఠిన శిక్ష పడే వరకు ప్రభుత్వం వదిలిపెట్టదని తెలిపారు. మహిళా సంక్షేమ శాఖ మంత్రిగా, ఆడబిడ్డగా, ఆదివాసి బిడ్డగా బాధితురాలికి న్యాయం చేయాల్సిన బాధ్యత తనకు ఎక్కువగా వుంటుందన్నారు.

మహిళలపై దాడి, లైంగిక దాడి చేసిన నింధితులను తక్షణం ఉరి తీసేలా కేంద్ర ప్రభుత్వం చట్టం చేస్తే... అమలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అలాంటి చట్టాన్ని బీజేపీ నేతలు తీసుక రాగలరా అని సవాలు చేశారు. అనవసరంగా జనాలను రెచ్చగొట్టడం మానుకోవాలని హితవు పలికారు. అయితే జైనూరు ఘటనకు మతం రంగు పూసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్న అనుమానాలను వ్యక్తం చేశారు. మత కొట్లాటలు రేపెందుకు కుట్రలు పన్నుతున్న శక్తుల పట్ల తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# జీవో నెం 33.. హైకోర్టులో ప్రభుత్వానికి ఊరట

- స్థానికత ప్రకారమే సీట్ల కేటాయింపు
- గైడ్‌లైన్స్ రూపొందించాలని ప్రభుత్వానికి ఆదేశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం.. సర్కారు జారీ చేసిన జీవో 33 విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ జీవోను సవాలు చేస్తూ పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయటంతో కోర్టు ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ కొనసాగించింది. ఈ విషయంలో ప్రభుత్వపు ఆలోచన సముచితమైనదేనని కోర్టు వ్యాఖ్యానిస్తూ, సీట్ల కేటాయింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు బి.మయూర్‌రెడ్డి, డి.వి.సీతారాంమూర్తి తదితరులు వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

విభజన చట్టం ప్రకారం 2014 జూన్ 2 నుంచి 2024 జూన్ 2 వరకు అడ్మిషన్ల విషయంలో పాత పద్ధతే కొనసాగించాల్సి ఉంది. కాగా, 2024 జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తి కావడంతో.. తెలంగాణ రాష్ట్రం స్థానికతను నిర్ధారించుకునేందుకు సొంత రూల్స్ ఫ్రేమ్ చేసుకుని, దాని ప్రకారమే తెలంగాణలోని విద్యాసంస్థల్లో అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంది. దీంతో ప్రభుత్వం జీవో నంబరు 33 ను తెచ్చింది. దీని ప్రకారం.. చివరి విద్యాసంవత్సరం నుంచి నాలుగేండ్లు (అంటే 9 నుంచి 12వ తరగతి వరకు) ఎక్కడ చదివితే అక్కడే లోకల్ అని పేర్కొన్నారు. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం 2017 జులై 5వ తేదీన జీవో నెంబర్ 114 ప్రకారం.. ఆరు నుంచి 12వ తరగతి వరకు ఏడేండ్లలో నాలుగేండ్లు చదివి ఉంటే స్థానికులుగా పరిగణించారని, ప్రస్తుతం తొమ్మిది నుంచి



12వ తరగతి వరకు చదివితేనే స్థానికులనడం వల్ల లోకల్ విద్యార్థులకు నష్టం జరిగే ప్రమాదముందనే వాదన తెరమీదికొచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అధ్యయనం చేయకుండా తెచ్చిన ఈ జీవో వల్ల తెలంగాణ వారికి అన్యాయం జరగుతుందని బీఆర్ఎస్, సీపీఐ(ఎం) వంటి పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. దీనిపై కొందరు కోర్టునూ ఆశ్రయించారు.

అయితే జీవో నంబరు 33ను సమర్థిస్తూ..స్థానికులంతా స్థానిక కోటా కింద అర్హులేనని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. స్థానికులు ఎవరనే అంశంపై సరైన మార్గనిర్దేశకాలు లేవని ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిర్ధరణకు సరైన మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వానికి ఆదేశించింది. పిటిషనర్ల స్థానికతను నిర్ధారించుకున్నాకే వారి దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. పిటిషన్ దాఖలు చేసిన విద్యార్థులు తెలంగాణ శాశ్వత నివాసులేనా కాదా అన్నది పరిశీలించాలని హైకోర్టు సూచించింది. ఇందుకోసం ప్రస్తుతం మార్గదర్శకాలు లేనందున కొత్తగా రూపొందించి, అమలు చేయాలని కాళోజీ వర్సిటీని హైకోర్టు ఆదేశించింది.



# ఏపీ సీఎం చంద్రబాబుకు తప్పిన పెను ప్రమాదం..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వరద సహాయక చర్యలను పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి పెను ముప్పు తప్పింది. జస్ట్ మూడు అడుగుల దూరంలో ట్రైన్ ఆగిపోవడంతో ప్రమాదం తప్పినట్లయ్యింది.

భారీ వర్షాల కారణంగా పొంగిన వరదలు ఇంకా విజయవాడను వీడలేదు. పలు ప్రాంతాల్లో ఇప్పటికీ బుడమేరు వరద ప్రవహిస్తోంది. దీంతో ఇప్పటికీ సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఈ సహాయక కార్యక్రమాలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగానే సీఎం చంద్రబాబు ముధరా నగర్ రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో ట్రాక్‌పై నుంచి ట్రైన్ వస్తోంది. ఇది గమనించిన భద్రతా సిబ్బంది.. ట్రైన్ వస్తోందని, అక్కడి నుంచి వెళ్దామని చెప్పారు. మరోవైపు విషయాన్ని గమనించిన చంద్రదండు కార్యకర్తలు.. లైన్‌మెన్‌ను అలర్ట్ చేశారు. ట్రైన్‌కు ఎర్రజెండా ఊపడంతో ట్రైన్ స్లో అయ్యింది. చంద్రబాబు భద్రతా సిబ్బంది ఆయన చుట్టూ సరౌండ్ అయ్యారు. చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధుబాబు కూడా చంద్రబాబు వెన్నంటి ఉన్నారు. ట్రైన్ సరిగ్గా మూడు అడుగుల దూరంలో ఆగిపోయింది. దీంతో భద్రతా సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

# హోం మంత్రి లేకపోవడం వల్లే శాంతి భద్రతల సమస్యలు




- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

: తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి పూర్తిస్థాయి హోం మంత్రి లేకపోవడం వల్లే శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని, జైనూర్ లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు జైనూర్ ఘటనపై కేటీఆర్ ట్వీట్ చేశారు.కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఒక ఆదివాసీ మహిళపై జరిగిన అత్యాచారయత్నం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అక్కడ జరిగిన హింసాత్మక చర్యల్లో అనేక ఆస్తుల విధ్వంసం జరగడం దురదృష్టకరం. బాధిత మహిళకు కేవలం లక్ష రూపాయల పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గం. ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్నాయని ముందస్తు సమాచారం ఉన్నా వాటిని నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది అని కేటీఆర్ మండిపడ్డారు. జైనూర్‌లో తక్షణమే శాంతి నెలకొనేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బాధిత మహిళకు మెరుగైన వైద్యం అందించి, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలి. అల్లర్లలో ఇళ్లు, షాపులు కోల్పోయి నవారికి సాయంగా నిలవాలి. పూర్తి స్థాయి హోం మంత్రి లేకుండానే తొమ్మిది నెలలుగా రాష్ట్రాన్ని నడపడం వల్లనే తరచూ ఇటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.

## కొణతం దిలీప్ అరెస్ట్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణా డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కొంతకాలం క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంపై, సిఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు సైబర్ క్రైమ్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. కాగా, కొణతం దిలీప్ అరెస్టును బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఆయనకు ఎందుకు అరెస్టు చేశారు..? ఏ కేసులో అరెస్టు చేయాల్సి వచ్చిందో చెప్పాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ క్రమంల ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి, దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పటోళ్ల కార్తీక్ రెడ్డి, మన్నె క్రిశాంక్, సతీశ్ రెడ్డి, వాసుదేవ రెడ్డితో పాటు పలువురు నాయకులు బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయానికి వెళ్లారు. కొణతం దిలీప్‌కు ఎందుకు అరెస్టు చేశారో చెప్పాలని వారు పోలీసులను అడిగారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతోనే అతణ్ని అక్రమంగా అరెస్టు చేశారని జగదీశ్‌రెడ్డి దుయ్యబట్టారు. దిలీప్ వల్ల శాంతిభద్రతలకు ఎక్కడ భంగం జరిగిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## పవన్ కల్యాణ్‌కు అస్వస్థత



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జ్వరం, దగ్గుతో బాధపడుతున్నారు. వైరల్ జ్వరం బారినపడినప్పటికీ ఆయన తన నివాసంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఏలేరు రిజర్వాయర్ వరద పరిస్థితులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాగా, వరద నీరు తగ్గిన ప్రాంతాల్లో పారిశుద్ధ్యం నెలకొనేలా కృషి చేయాలని... అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా, సూపర్ క్లోరినేషన్ చేపట్టాలని, దోమలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# పినపాక ఏజెన్సీలో భారీ ఎన్‌కౌంటర్..
## ఆరుగురు మావోయిస్టులు మృతి



(మొదటి పేజీ తరువాయి)

గాయపడిన పోలీసులను భద్రాచలం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతి చెందిన మావోయిస్టుల్లో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారని మృతుల్లో మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం %-% అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటి కార్యదర్శి లచ్చన్న దంపతులు ఉన్నారు. మృతి చెందిన వారి వివరాలు 1.లచ్చన్న అలియాస్, వీరయ్య, 2. శుక్రాం, 3.తులసీ, 4.దుర్గేష్, 5.రాము, 6.కోసి ఉన్నట్లు సమాచారం. సంఘటనా స్థలంలో ఏకే 47 ఆయుధాలు 02, ఎస్ఎల్ఆర్ 01, 303 రైఫిల్ 01, పిస్టల్ 01, మ్యా గ్జిన్‌లతో పాటు కిట్ బ్యాగులు ఇతర సామగ్రి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఎదురు కాల్పుల్లో మరో మావోయిస్టు పారిపోయాడనే సమాచారంతో స్పెషల్ పార్టీ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలు మావోయిస్టులకు కంచుకోటలుగా ఉండేవి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టుల ఏరివేత పటిష్టంగా అమలు చేయడంతో ఈ ప్రాంతాల్లో మావోయిస్టులు తమ ఉనికిని కోల్పోయి, పొ రుగు రాష్ట్రమైన చత్తీస్‌గఢ్‌కు తమ కార్యకలాపాలను విస్తరించారు. తెలంగాణ రాష్ట్రంలో పట్టు సాధించాలనే లక్ష్యంతో చత్తీస్‌గఢ్‌కు నుంచి భద్రాద్రి, ములుగు జిల్లాలో భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ లచ్చన్న అలియాస్ వీరయ్య దళం సంచరిస్తుందనే సమాచారం అందినట్లు తెలుస్తుంది.గత నెల రోజులుగా స్పెషల్ పార్టీ పోలీసులు అడవులను జల్లెడ పడుతున్నాయి. జిల్లాలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఛత్తీస్‌గడ్‌కు మావోయిస్టులు వెళ్లలేరనే లక్ష్యంతో గురువారం కరకగూడెం మండల పరిధిలో లచ్చన్న దళం ఉందన్న సమాచారంతో భారీ సంఖ్యలో పోలీసులు కూం బింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారు. పక్కా ప్లాన్‌తో ఉన్న పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల కారణంగా మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ అగ్రనాయకులు జగన్ మృతి చెంది 24గ ంటల కాకముందే మరో అగ్రనేత లచ్చన్న మృతి చెందడం మావోయిస్టులకు ఎదురుదెబ్బగానే భావించాలి.

రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ విప్లవ ద్రోహుల వల్ల జరిగిందని మావోయిస్టు పార్టీ పత్రిక ప్రకటనను కేంద్ర కమిటీ సభ్యులు ఆజాద్ పేరుతో విడుదల చేసింది. రఘునాథపాలెం ఎన్‌కౌంటర్‌లో తమ పార్టీ డివిజన్ సభ్యులు కామ్రేడ్ లచ్చన్నతో పాటు మరో 5గురు సభ్యులు మృతి చెందారని తెలిపారు. త్యాగాలు తమ పార్టీకి కొత్త కాదని, ఎన్‌కౌంటర్‌లకు తాము భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. పోలీసులు జరిగిన ఎన్‌కౌంటర్‌కు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, తగిన మూల్యం చెల్లించుకుంటామని తెలిపారు. మృతి చెందిన మావోయిస్టులకు సంఘీభావంగా 9న బంద్ పాటిస్తున్నామని, ప్రజలు, వ్యాపార వర్గాలు బంద్‌కు సహకరించాలని లేఖలో పేర్కొన్నారు.

# విద్యార్థులు ధర్నాకు దిగేలా చేయడం దురదృష్టకరం

- ఎమ్మెల్యే హరీశ్‌రావు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ దినోత్సవం రోజున తమ గురువులను సన్మానించుకునే సంబరాల్లో మునిగి తేలాల్సిన విద్యార్థులను రేవంత్ ప్రభుత్వం చదువులు మానేసి ధర్నాలకు దిగేలా చేయడం దురదృష్టకరం అని హరీశ్‌రావు అన్నారు. తమ గురువులకు మద్దతుగా గురుకుల విద్యార్థులు పిడికిలి బిగించడం అభినందనీయమన్నారు. ఐఐటి, ఎన్ఐటి, నీట్ వంటి జాతీయస్థాయి పరీక్షల్లో విద్యార్థులు ర్యాంకులు సాధించేలా వెన్నంటి నిలిచిన గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఉపాధ్యాయులను నిర్దాక్షిణ్యంగా తొలగించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.విద్యా సంవత్సరం మధ్యలో 6200 మంది గురుకుల ఉపాధ్యాయులను తొలగించిన మీ నిర్ణయం వల్ల ఈరోజు వేలమంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా ఉద్యోగాల నుంచి తీసేసిన గురుకుల టీచర్లను తక్షణమే విధుల్లోకి తీసుకుని విద్యార్థుల భవిష్యత్ కాపాడాలి. తమ పిల్లల భవిష్యత్తు గురించి కలలుగన్న తల్లిదండ్రులకు ఏమని సమాధానం చెబుతారు రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు నిలదీశారు.

## కేజ్రీవాల్ బెయిల్‌పై తీర్పు రిజర్వు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి సిబిఐ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం గురువారం సుదీర్ఘంగా విచారణ జరిపింది. కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఇటీవల కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తే సమాజానికి ప్రమాదకరమేమీ కాదని సుప్రీంకోర్టు పేర్కొందని, బెయిల్‌పై విడుదల చేయాలని రెండుసార్లు సుప్రీంకోర్టు, ఒకసారి ట్రయల్ కోర్టు ఆదేశించాయని ధర్మాసనానికి తెలిపారు. ఒకసారి ఎన్నికల ప్రచారం కోసం సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌ను బెయిల్‌పై విడుదల చేసిందని, మరోసారి ఈడీ కేసులో బెయిల్ లభించిందని చెప్పారు. కేజ్రీవాల్ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నారని, సమాజానికి ప్రమాదం లేదని వాదించారు. రెండేళ్లుగా సీబీఐ ఆయనను అరెస్టు చేయలేదని, అయితే, జూన్ 26న మాత్రమే అరెస్టు చేసిందని అన్నారు.

సీబీఐ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్ వి రాజు వాదనలు వినిపించారు. కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. బెయిల్ కోసం మొదట ట్రయల్ కోర్టుకు వెళ్లాలని, నేరుగా సుప్రీంకోర్టులో అప్పీల్ చేయడంపై అభ్యంతరం తెలిపారు. సీఎం ప్రత్యేకమైన వ్యక్తి అని, అందుకు భిన్నమైన పద్ధతిని అవలంభిస్తున్నట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. సిబిఐ అరెస్టును సవాల్ చేయడంతో పాటు రెండో పిటిషన్‌లో బెయిల్ కోసం అప్పీల్ చేశారు. ఇంతకుముందు ఆగస్టు 5న ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

# ఎమ్మెల్యేపై లైంగిక వేధింపుల ఆరోపణలు

- వీడియో విడుదల చేసిన ఓ మహిళ
- పార్టీ నుంచి సస్పెండ్ చేసిన టీడీపీ అధిష్టానం
- తనను కుట్రలో ఇరికించారన్న ఎమ్మెల్యే



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబుకు ఓ మహిళ లేఖ రాశారు. ఎమ్మెల్యే వేధింపులను పెన్ కెమెరాలో రికార్డు చేసినట్లు ఆమె తెలిపారు. రాత్రి వేళల్లో మెసేజ్‌లు పంపి వేధించారని లేఖలో పేర్కొన్నారు. తిరుపతిలోని భీమాస్ ప్యారడైజ్ హోటల్‌కు పిలిపించి వేధించారని ఆరోపించారు. ఈ ఘటనను టీడీపీ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఎమ్మెల్యే ఆదిమూలంను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. దీనిపై ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పలుమార్లు తనపై అఘాయిత్యానికి పాల్పడ్డాడంటూ ఓ మహిళ ఇవాళ సంచలన వీడియో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన టీడీపీ అధిష్ఠానం ఎమ్మెల్యే ఆదిమూలంపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదిమూలం స్పందించారు. తాను 24 గంటలూ ప్రజా సేవకుడ్ని. ఆమె పార్టీలో ఒక మహిళా అధ్యక్షురాలు. ఎన్నికల సమయంలో నాతో పాటు ప్రచారంలో తిరిగిందని తెలిపారు. ఇప్పుడు కావాలనే కుట్రపూరితంగా తనపై ఆరోపణలు చేస్తున్నారని, తాను కిందిస్థాయి నుంచి పైకి వచ్చినవాడ్ని అని, 50 సంవత్సం ాలుగా రాజకీయాల్లో ఉన్నానన్నారు. ఆ మహిళ నా ప్రత్యర్థులతో చేరి కుట్ర పన్ని ఈ విధంగా ఆరోపణలు చేస్తోంది. ఆమెను తాను ఎక్కడా వేధించలేదని, ఆమెను ఓ సోదరి మాదిరిగా భావించానని స్పష్టం చేశారు. టీడీపీ మండల ఇన్చార్జినంటూ ఆమె ఆర్నెల్ల పాటు తమతో తిరిగిందని వివరించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, విశ్వసనీయత ఉన్న వ్యక్తిని అని,ఆమె ఎలా వచ్చిందో, ఎలా పోయిందో తనకు తెలియదన్నారు. దేవుడి సాక్షిగా, నా బిడ్డల సాక్షిగా చెబుతున్నాను. నేను ఏమైనా తప్పు చేశానా లేదా అనేది ఆమెనే అడగండి. నా నియోజకవర్గంలో ఎవరినైనా అడగండి నేను ఎలాంటివాడ్నో చెబుతారు. తాను తప్పు చేస్తే భగవంతుడు శిక్షిస్తాడు. అది మార్ఫింగ్ చేసిన వీడియో. కుట్రలో భాగంగానే ఆమెను వాడుకున్నారు. నేరుగా ఆమెతోనే చర్చించడానికైనా సిద్ధమని కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు.

## కొణతం దిలీప్ అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నా

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్, ప్రముఖ తెలంగాణవాది కొణతం దిలీప్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ అరెస్టు తెలంగాణలో పెచ్చుమీరుతున్న నిరంకుశత్వానికి స్పష్టమైన సంకేతం అని ఆయన తెలిపారు. ఈ మేరకు హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

గత కొంతకాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పులను సోషల్ మీడియాలో దిలీప్ కొణతం ఎత్తి చూపుతున్నారు. ఈ క్రమంలో గతంలోనే ఒక కేసు పెడితే రేవంత్ ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు వేసింది. దిలీప్‌ను అరెస్టు చేయొద్దని కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ ఇవాళ ఆయనను పోలీసులు అరెస్టు చేశారు.

## ప్రజాపాలన అంటే
# ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేనా..?

- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ అక్రమ అరెస్టును బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజా పాలన అంటే ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేనా..? అని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కొంతకాలంగా ప్రభుత్వ అసమర్థ చేతగాని తనాన్ని దిలీప్ ప్రశ్నించటాన్ని రేవంత్ సర్కార్ తట్టుకోలేకపోతోంది. కొన్ని రోజుల క్రితం కూడా తప్పుడు కేసులో ఇబ్బంది పెట్టాలని ప్రయత్నిస్తే హైకోర్టు చీవాట్లు పెట్టిన బుద్ధి రాలేదు. ఎలాగైనా దిలీప్ గొంతునొక్కాలన్న ఉద్దేశంతో మరోసారి అక్రమంగా అదుపులోకి తీసుకున్నారు. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఏ కేసులో అదుపులోకి తీసుకుంటున్నారో కూడా చెప్పకుండా అరెస్ట్ చేశారని కేటీఆర్ పేర్కొన్నారు.అక్రమ అరెస్ట్‌లు, నిర్బంధాలతో పాలన కొనసాగించవచ్చునుకుంటే అది మీ భ్రమే. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అక్రమ నిర్బంధాలు చేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నించే వాళ్లు మరింత మంది పుట్టుకొస్తారు. అక్రమంగా అదుపులోకి తీసుకున్న దిలీప్‌ను తక్షణమే విడుదల చేయాలి. 9 నెలలుగా తెలంగాణలో వాక్ స్వాతంత్రం లేదు. నిరంకుశ పాలన సాగుతోందని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# లోయలో పడ్డ వాహనం.. నలుగురు జవాన్ల మృతి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సిక్కింలోని పాక్యోంగ్ జిల్లాలో గురువారం జరిగిన ప్రమాదంలో నలుగురు భారత సైనికులు మరణించారు. పశ్చిమ బెంగాల్‌లోని పెడోంగ్ నుంచి సిక్కింలోని జులూక్‌కు సిల్క్ రూట్ గుండా వెళ్తుండగా వీరు ప్రయాణిస్తున్న వాహనం దాదాపు 800 అడుగుల లోతుగల లోయలో పడిపోయింది. ఈ వాహనం డ్రైవర్ ప్రదీప్ పటేల్, క్రాఫ్ట్మన్ డబ్ల్యూ పీటర్, నాయక్ గురుసేవ్ సింగ్, సుబేదార్ తంగపండి మరణించినట్లు అధికారులు గుర్తించారు. వీరంతా పశ్చిమ బెంగాల్‌లోని బినగురి యూనిట్‌కు చెందినవారు.

# ఉపాధ్యాయులు సామాజిక రుగ్మతల నిర్మూలనకు కృషి చేయాలి

- సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- 26 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని,సామాజిక రుగ్మతల నిర్మూలనకు ఉపాధ్యాయుల కృషి చేయాలనీ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు .గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆద్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరయ్యారు..

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్ళ బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఖాళీల భర్తీకి ఇటీవల దాదాపు 12 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసి, పరీక్ష నిర్వహించిందని, పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుందని అన్నారు . అమ్మ ఆదర్శ పాఠశాల కింద స్కూళ్ళలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుందని, ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువు కొని 10/10 సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి సన్మానించారని అన్నారు . ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఉపాధ్యాయుల ప్రమోషన్స్, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి రాష్ట్రపతి, శాస్త్రవేత్తలు, కలెక్టర్లు, ఇంజనీర్లుగా ఎదిగారని,తాను ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి ఎదిగానని అన్నారు . ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డ్స్ స్వీకరించిన వారికి అభినందనలు తెలియజేశారు. మిగితా టీచర్లు వీరిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా నుంచి జాతీయ స్థాయికి తాడురి సంపత్ కుమార్, రాష్ట్ర స్థాయికి పాకాల శంకర్ ఎంపిక కాగా, వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసి వారు ఎంచుకున్న రంగంలో రాణించేలా టీచర్లు కృషి చేస్తున్నారని,ఉపాధ్యాయులు ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని,సామాజిక రుగ్మతల నిర్మూలనకు కృషి చేయాలని అన్నారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ తన బాల్యం నుంచి ఈ స్థాయికి వచ్చేలా తీర్చిదిద్దిన టీచర్లు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలను అన్ని అంశాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. సామాజిక, పర్యావరణ స్పృహ, నైతికత, విలువలు, పోటీతత్వం నేర్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ ఛైర్పర్సన్ జిందం కళా, సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా విద్యాధికారి రమేష్, జీసీడీఓ పద్మజ ఎంఈఓలు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.








# మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేయాలి..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆద్వర్యంలో తయారు చేసిన 2 వేల మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు నిచ్చారు. గురువారం వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆద్వర్యంలో తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదయంలోని తన ఛాంబర్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా పంపిణీ చేశారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు, ఆయా గ్రామాల్లో విగ్రహాలు పంపిణీ చేయాలని,పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని అన్నారు . ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ భిక్షపతి, జీఎం ఇండస్ట్రీస్ భారతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ, సిరిసిల్ల**



శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్ట్ లు పెడితే కఠిన చర్యలు తప్పవు అని ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్ మొదలైన వాటిలో మతవిద్వేషాలకు సంబంధించిన ఫెక్ మెసేజ్ లు వీడియోలు, ప్రజలెవరూ పోస్ట్ లు చేయడం, ఫార్వార్డ్ చేయడం చేయవద్దని అన్నారు.ఒకవేళ ఎవరైనా ఇట్టి ఆదేశాలను ఉల్లంఘించి ఫార్వార్డ్ చేసిన పోస్ట్ చేసిన వారితో పాటుగా గ్రూప్ ఆడ్మిన్‌లపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి,కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరు ఎలాంటి ఉద్వేగాలకు లోనూ కాకుండా సంయమనం పాటిస్తూ శాంతి భద్రతల సంరక్షణకు పోలీస్ శాఖకు సహకరించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

## భారత్ ఖాతాలో 25వ పతకం

**బలగం టీవీ, పారీస్**



పారాలింపిక్స్‌లో భారత్ హవా కొనసాగుతూనే ఉంది. ఈ క్రీడల్లో భారత్ రికార్డు స్థాయిలో 25వ పతకాన్ని సాధించింది. పురుషుల జూడోలో భారత్‌కు చెందిన కపిల్ పర్మార్ కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. 60 కిలోల జె1 విభాగంలో కపిల్ అద్భుత ప్రదర్శనతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకున్నాడు. కాంస్యం కోసం జరిగిన పోరులో కపిల్ పర్మార్ 100 తేడాతో బ్రెజిల్‌కు చెందిన ఎలిల్టన్ డి ఒలివెరాను ఓడించాడు. ఆరంభం నుంచే దూకుడును ప్రదర్శించిన కపిల్ ఏ దశలోనూ ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇవ్వలేదు. కాగా, పారాలింపిక్స్‌లో భారత్ ఇప్పటి వరకు 5 స్వర్ణాలు, 9 రజతాలు, 11 కాంస్య పతకాలు గెలుచుకుంది.